ఆగస్టు 29 – ప్రతి ఆంధ్రుని హృదయం గర్వంతో ఉప్పొంగవలసిన పర్వదినం. ఎందుకంటే అది గిడుగు రామ్మూర్తి పంతులుగారి జన్మదినమే కాక తెలుగు భాషాదినం కూడా. రాజరాజనరేంద్ర ది స్పాన్సర్ ఆఫ్ టెల్గూ లాంగ్వేజ్ కనుక సుబ్బరాం అర్జెంట్‌గా 28వ తేదీ రాత్రే తన పేరు రారానరేంద్రగా మార్చుకొని –

రేపు సూర్యోదయ సమయాన గిడుగు వారికి నమస్కరించుకొని – నేటి నుంచి నేను తెలుగే మాట్లాడుతాను. మరే యితర భాషా మాట్లాడను – అని ప్రతిజ్ఞ పట్టాలని నిర్ణయించుకొని నిద్ర పోయాడు.

అనుకున్నట్టే 29వ తేదీ ఉదయానే లేచి మంచం మీద బాసింపట్టువేసి, చెయ్యి ముందుకు చాపి ప్రతిజ్ఞ పట్టాడు. తర్వాత గదిలోని వస్తువులన్నింటినీ చూస్తూ వాటిని తెలుగులో ఏమనాలో మనసులోనే చెప్పుకున్నాడు. తర్వాత బాత్రూంలోని వస్తువులేమిటని ఆలోచిస్తూండగా "హయ్యో, బాత్రూం అనే ఆంగ్లపదం మన



# షాక్

సులో దూరిందే" అని కాసేపు మధనపడి, తర్వాత – ఆంగ్లం మనసులో దూరినా ఫర్వాలేదు, పెదవి దాటకూడదు అని సవరణ చెప్పుకున్నాడు.



బాత్రూంలో ఉండేవి సబ్బుబిళ్ల, షాంపూ, టూత పేస్ట్, బ్రష్ – ఇంతకూ సబ్బుబిళ్ల తెలుగు మాటేనా? అని అనుమానం. రేపు పుస్తక భాండాగారమున నిఘంటు పరామర్శ చేద్దాములే అని సంకల్పం చెప్పుకున్నాడు. సబ్బు సరే, షాంపూని తలరుద్దు ముద్ద అందామా? బాగు బాగు మరి టూత్ పేస్ట్? పళ్లుతోము ముద్ద! టూత్‌బ్రష్? పళ్లుతోముకొను కొనకుచ్చుపుడక! బాగు... మహా బాగు! కొద్దిగా ఆలోచించాలిగానీ ఆంగ్ల పదాలకు సరియైన తెలుగు పదాలు దొరక్క పోవు.

స్నానం చేసి వచ్చాకగాని తెలుగు మాటలు దొరకడమెంత కష్టమో అర్థంకాలేదు రారా నరేంద్రకు. అమ్మను కాఫీ అడగాలి, టీని తేనీరు అంటారుగానీ కాఫీని ఏమనాలి? అది ఒక రకం గింజల కషాయం. దానిలో పాలు, పంచదార కలుపుతారు. అందువల్ల దాన్ని క్షీర శర్కర మిశ్రిత ఒక దినుసుగింజల కషాయం అనొచ్చు. కానీ అంతమాట అనేసరికి ప్రాణం రావుల్ తప్పుతుంది. కనుక పొడి అక్షరాలే మేలు.

వంటింటి కెల్లి 'క్షీశమి ఒదిగింక' యిమ్మని అమ్మని అడిగాడు. ఆ మాటవిని కొడుకుని ఎగాదిగా చూసి నిక్షేపంలాంటి కుర్రాడిని రాత్రికి రాత్రి ఏ దయ్యం పట్టిందోనని హడలిపోయింది కుసుమాంబ. దయ్యంకాదు... తెలుగు తల్లి పట్టిందని తన ప్రతిజ్ఞను, తన కొత్త పేరునూ వివరించాడు.

"నీ ఉద్దేశం మంచిదేగానీ భాష భయపెట్ట కూడదురా. సరళంగా సాగిపోవాలి. దృశ్యశ్రవణ పేటిక కంటే టీవీ అనడం, క్షీశమి ఒదిగింక

**ప్రఫుల్లచంద్ర**

కంటే కాఫీ అనడం ఈజీ కదా. కాఫీ, కార్డు, టీవీ, ఫోన్ లాంటివిని పరాయి మాటల్లా వినిపించవు. బాలీవుడ్, మసాలా లాంటి వందల కొద్దీ పదాలు ఇంగ్లీషులో ఒదిగిపోయినట్లు కొత్త ఇంగ్లీషు డిక్షనరీలు సూచిస్తున్నాయి. ఇతర భాషాపదాలను కూడా కలుపుకుపోయేదే సజీవ భాష" హితోపదేశం చేసి "పాలు లేవు. తెప్పిద్దామంటే రత్తాలింకా రాలేదు. నువ్వే సెంటర్ కెళ్లి రెండు ప్యాకెట్లు పట్టుకురా" అంది.

"అదిగో, మళ్లీ ఆంగ్లము!" హెచ్చరించాడు రారాన.

"సరే... సరే... కేంద్రమునకు పోయి రెండు పొట్లములు తెమ్ము" నవ్వేసింది అమ్మ. రారాన పాలు తెచ్చేసరికి అక్క వంటింటిలోనే ఉంది. క్షీశమి ఒదిగింక చేసి వాళ్లిద్దరికీ మచ్చలేని ఉక్కు పాత్రలలో (స్టెయిన్‌లెస్ స్టీలు గ్లాసుల్లో) యిచ్చి 'బరంపురం నుంచి ఎల్లుండి అక్కను చూడడానికి ఎవరో వస్తున్నారు. నీ తిక్క భాషతో వారిని హడలగొట్టకు' అని హెచ్చరించింది కుసుమాంబ.

"నేను హడలగొట్టేదేమిటి? అక్కే తన భాషతో వాళ్లని చంపేస్తుంది" నవ్వేశాడు రారాన. ఎందుకంటే అక్క ఒక హంతకి. తన త్రిభాషాజ్ఞానంతో ఒక భాషలోని ఒకపదం నడ్డి విరిచి ఇంకో భాషలోని మరోపదం చేతులు నరికేసి రెండింటికీ అంటుకట్టి కొత్త పదాలు సృష్టించి ఆ వికృత భాషతో జనాల్ని హత్య చేస్తుంది. "నేను పిలవగానే పరుగున వచ్చేయ్" అని సుబ్బరంగా తెలుగులో చెప్పడానికి బదులు "నేను కాల్చేస్తే నువ్వు రన్నుకుంటూ ఆజా!" అంటుంది.

"దేఖో! ఇప్పుడే టెల్లుతున్నా! వాళ్లముందు హెడ్ హేంగ్ చేసుకొని బైఠూంగీ నహీ... కూర్చోను. జాగింగ్ చేస్తూ వాళ్ల క్వశ్చన్స్‌కి జవాబ్ దూంగీ!" హెచ్చరించింది ప్రభ ఇంతకు ముందొకసారిలాగే చూడవచ్చిన వాళ్లముందు బుద్ధిగా తలవంచుకొని కూర్చోకుండా పచార్లు చేస్తూ తన త్రిభాషాజ్ఞానం ఒలకబోస్తే వాళ్లు జడుసుకొని పారిపోయారు! ఇది పద్ధతి కాదే అని ఎంత మొత్తుకున్నా వినదు. "నువ్వొక తిక్క మాలోకానివి. నీ యిష్టం వచ్చినట్టు ఆఘోరించు" అనేసింది కుసుమాంబ నిస్పృహగా.

ఈలోగా పనిమనిషి రత్తాలు రాగా దానికి కాఫీ యిస్తూ ఈ రోజు నుంచి కాఫీ పేరు మారిపోయింది అంటూ కొత్త పేరు పుట్టు పూర్వోత్తరాలు వివరించింది కుసుమాంబ.

రత్తాలుకి ఈ కొత్త భాషాభిమానం నచ్చలేదు. "సగ్గు బియ్యం పాయసం కూడా పాలు, చక్కెర కలిసిన గింజల కషాయమే. మీరు క్షీశమీ ఒదిగింక అని అడిగితే కాఫీ బదులు పాయసం ఇవ్వగలరు!" పకపకా నవ్వింది చదువుకున్న స్టైలు స్టైలు పనిమనిషి రత్తాలు.

రారాన నోట మాట రాలేదు. అతని అవస్తకు జాలిపడి, సగ్గుబియ్యం గింజలు కాదు. ఫ్యాక్టరీలో తయారయ్యే సరుకు అని వివరించింది కుసుమాంబ. "ఏమో, నాకు క్షీశమి ఒదిగింక కంటే కాఫీయే రుచిగా ఉంది" అంది భాషాభిమానం లేని ఆ బండ!

బరంపురం వారి ముందు తిక్క తిక్కగా మాట్లాడవద్దని కొడుకునీ, కూతుర్నీ మరోసారి హెచ్చరించింది కుసుమాంబ. "ఆ సంగతి అక్కకు గట్టిగా చెప్పు మాతా! నాకా రోజున తెలుగు అభిమాన సంఘ సమావేశం ఉంది. నేనిక్కడ అంతర్ధానమై అక్కడ ప్రత్యక్షం కావలసి ఉన్నది" నుడివాడు రారాన.

* * *

బరంపురంలో ఏదో ప్రైవేటు కంపెనీలో




పనిచేస్తున్న రాజేష్, అతని ఇద్దరు మిత్రులు బబ్లా, తబ్లా, అతని తల్లి లక్ష్మమ్మ పెళ్లిచూపుల కొచ్చారు. తల్లీ, కొడుకూ ఇంటిలో తెలుగే మాట్లాడినా బబ్లా, తబ్లాలది తెలుగు మిశ్రిత ఒరియా. ఆ భాషలో అకారం బదులు ఒకారం, 'వ' బదులు 'భ' వాడుతారు. అందువల్ల ఇతర భాషలవారు గేలి చేస్తూండడంతో శ్రమపడి 'వ' ని సాధించి, 'భ' వాడవలసి వచ్చినా 'వ' అంటూంటారు కొందరు విద్యావంతులు. మనం ప్రభావతి, టీవీ అనే మాటల్ని వాళ్లు ప్రొవోభతి, టీబీ అంటూంటారు.

పరిచయాలు, కుశలప్రశ్నలూ అయ్యాక – ప్లేట్లలో కజ్జికాయలు, కాకినాడ కాజాలు, పకోడీ తెచ్చి టీపాయ్ మీద ఉంచి రత్తాలు యిలా వెళ్లగానే అలా ప్రభ వచ్చి ర్యాంప్ మీద అందాల పోటీలో పాల్గొనే మహిళ మాదిరిగా అటూ యిటూ రెండుసార్లు నడిచింది. వాళ్లు గుడ్లప్పగించి ఫ్యాషన్ షో చూస్తున్నట్లుండిపోయారు గానీ ప్రశ్నలు అడగలేదు.

మరో రెండుసార్లు క్యాట్‌వాక్ చేసి, అప్పటికీ వాళ్లు ప్రశ్నలడగక పోవడంతో లోనికి వెళ్లిపోయింది ప్రభ. ఒరియా వాళ్లకి స్వీట్లు యిష్టం. బబ్లా కాజా తీసుకొని కొరికాడు. అంతే... దానిలోని రసం గడ్డం మీదుగా జారి షర్ట్‌మీద పడింది. అందరూ నవ్వేశారు.

"అందుకే దాన్ని ఖాజా అన్నారు. ఖా అంటే తిను, జా అంటే వెళ్లు. అంటే వాష్ బేసిన్ వద్ద కన్నమాట! నోరూ, షర్టూ కడుక్కోడానికి" నవ్వేసి కాజా తినే ఒడుపు ప్రయోగాత్మకంగా చూపించింది లక్ష్మమ్మ. కజ్జి కాయలవైపు అనుమానంగా చూశాడు తబ్లా.

"ఫర్వాలేదు. వాటిని ధైర్యంగా తినొచ్చు. దానిలో రసం ఉండదు" ఒరియాలో భరోసా యిచ్చింది లక్ష్మమ్మ.

ఇంతకూ అవేమిటి? అన్నట్లు చూశాడు బబ్లా – నోరూ, షర్టూ కడుక్కొని వచ్చి. స్నేహితులకు వివరించవలసిన బాధ్యత తన భుజాల

మీదకు ఎత్తుకున్నాడు రాజేష్. చిన్నప్పుడెప్పుడో అతడు కజ్జికాయలు తిన్నాడు. ఆ జ్ఞాపకాలతో చెప్పాడు "ఈ ప్రాంతంలో కలెక్టర్ కాయలని ఒక రకం మామిడికాయలు దొరుకుతాయి. బ్రిటిష్ పాలనలో ఒక కలెక్టర్ ఎక్కడ నుంచో ఒక టెంక తెచ్చి నాటాడు. ఆ చెట్టుకాయలు పండాక ఆ టెంకలు మరిన్నిచోట్ల పాతి, ఆ కాయల్ని కలెక్టర్ కాయలన్నారు. కాజీ అంటే మంత్రి కదా! హైదరాబాద్ ప్రాంతంలో ఒక మంత్రిగారు నాటిన చెట్ల నుంచి వచ్చిన కాయలే ఈ కజ్జికాయలు!"

రాజేష్ ఇంగ్లీషులో చెప్పడంతో అందరికీ అర్థం అయి, ఘొల్లున నవ్వేశారు. రాజేష్ బిక్క మొగం వేయగా అతని వైపు మురిపెంగా చూస్తూ అతని తెలివితేటలు మరిన్ని వివరించింది లక్ష్మమ్మ.

రాజేష్ చిన్నపిల్లాడిగా ఉన్నప్పుడు లక్ష్మమ్మ ఒకసారి జబ్బుపడగా చోడి జావ తాగమన్నాడట డాక్టర్. చోళ్లను రాగులు అంటారు కదాని రాగి అనేమాట గుర్తుంచుకో... కొట్టుకెళ్లి అరకేజీ రాగులు పట్రా అని పంపగా –

రాగి, రాగి అని మననం చేసుకుంటూ వెళ్తున్న చిన్న రాజేష్ రాయిని తన్నుకొని కిందపడి, రాగి అన్నమాట మరిచిపోయి షాపుకెళ్లి అరకేజీ వెండి యిమ్మన్నాడు. వాడు వీడిని ఎగాదిగా చూసి బంగారం షాపుకెళ్లమన్నాడు. వాడు కూడా వీడివైపొక పిచ్చిచూపు విసిరి పదివేలు యిమ్మంటే వీడు వెర్రిమొగం వేసుకొని యింటి కొచ్చేశాడు.

అందరూ హాయిగా నవ్వుతూంటే మరింత ఉత్సాహంగా... "ఈ మధ్య వచ్చిన ఒక సినిమాలో కుబేరుడి కూతురు రాయభారం అంటూ ఒత్తు'భ'తో భారంగా పాటపాడితే రాయబారం అంటే బరువైన రాయి అనుకున్నాడు మా వెర్రి



కె.జె. రమేష్ రచించిన "గుంటూరు నానీలు" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవయిత్రి డా॥ చిల్లర భవానీ దేవి. చిత్రంలో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత, నానీల నాన్న ఆచార్య ఎన్. గోపి, ప్రముఖ కవి జి.ర.సం. అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య. ప్రధాన కార్యదర్శి శ్రీ కోసూరి రవికుమార్ వున్నారు.

నాగన్న" చెప్పింది లక్ష్మమ్మ మళ్లీ నవ్వుల జడి వాన!

అప్పుడే టీ తీసుకొచ్చి అందరికీ యిచ్చిన రత్తాలు చెవిన సినిమా కబురు పడగానే పూనకం వచ్చింది దానికి – "అంతే కాదు మాజీ! ఆ సినిమాలో కుబేరుడికి ఇంగ్లీషురాదు గానీ కూతురు మాత్రం చకచకా మాట్లాడుతుంది. ఇంట్లో ఒకరికి ఇంగ్లీషు వస్తే మిగిలిన వారికీ కొద్దో గొప్పో అంటుతుంది కదాండీ! మరి కుబేరుడికి థాంక్యూ... అనడం కూడా రాకపోవడం ఏమిటీ? ఆ సినిమాలో ఇలాంటి తప్పులు చాలా ఉన్నాయి మాజీ!"

దాని ఉత్సాహం వారిలోనూ ఉత్సాహం రగల్చగా ఆ తప్పులేమిటో చెప్పమన్నారు. వాళ్లూ సినిమా పిచ్చోళ్లే కాబోలు! రత్తాలుకి పట్టపగ్గాలు లేవు. "కుబేరుడు యక్షుడు కదా, మరణం లేదు కదా. తనకు మరణమే శరణం అంటాడొకసారి. ఖర్మ, ఖర్మ అని రెండు మూడుసార్లు అంటాడు. కర్మ అనాలిగానీ ఖర్మ కాదు కదా మాజీ!" పాండిత్యం ఒలకబోసింది స్టైలు రత్తాలు. ఆ పాండిత్యానికి బరంపురం క్లీన్‌బౌల్డ్ అయింది.

"మీది ఏ నామము?" బబ్లూ అడిగాడు రత్తాలుని. ఆమెకా ప్రశ్న అర్థంకాలేదు.

"ఆప్‌కీ శుభ్‌నామ్... నామ్... నేమ్?" తంటాలు పడ్డాడు బబ్లూ. అప్పటికి బల్బు వెలిగిన రత్తాలు తన పేరు చెప్పింది. ఆ పేరు వింతగా తోచింది యిద్దరికీ.

"రథాలూ... యూ మీన్ చారియట్?" బబ్లూ అనుమానంగా అడగగా "రత్తాలూ... అనగా... బ్లడ్?" అడిగాడు తబ్లూ.

ఓరి బడుద్ధాయిలారా! రత్తాలు అంటే రథాలూ, రక్తమూ అనుకుంటున్నారా అని నవ్వుకొని, "రత్తాలు అంటే రత్నాలు... డైమండ్స్" వివరించింది లక్ష్మమ్మ.

"టెల్గూ బహుత్ ఖష్టం" అనుకున్నారిద్దరూ.

లోనికి పొమ్మని రత్తాలుకి సైగ చేసింది కుసుమాంబ. రత్తాలు లోనికి వెళ్లగానే అక్కడ నిరీక్షిస్తున్న ప్రభ "ఆమెను మాజీ అని కాల్చేస్తావేం? తుమ్మకో బుద్ధి నహీ క్యా?" కసిరింది.

ఈ వంకర భాష రత్తాలుకి అలవాటే. అర్థమయింది.

"మా అంటే అమ్మ. జీ అంటే గారు. అమ్మగారూ అని పిలిచాను. తప్పేంటి?" అడిగింది రత్తాలు.

"ఒసేయ్ స్టోనూ! మాజీ అనగా మదరిన్లా. అనగా... హత్తగారు!"

బరంపురం వారిని సాగనంపి లోనికొచ్చిన కుసుమాంబకి హాయిగా వుంది. వారి సరదా కబుర్లూ, భోళానవ్వులూ చూస్తోంటే వాళ్లకు పిల్ల నచ్చినట్టే ఉంది. అందుకే ఒక్క ప్రశ్నకూడా అడగలేదు.

"దేవుడా! ఈ సంబంధం ఖాయం చేస్తే రత్తాలు తలనీలాలు నీకు సమర్పించుకుంటా" అని మనసులోనే మొక్కుకుంది కుసుమాంబ.

* * *

వారం రోజులు గడిచాక లక్ష్మమ్మ నుంచి ఫోన్ – అబ్బాయికి అమ్మాయి తెగనచ్చేసిందట ముహూర్తాలు త్వరగా పెట్టించమని గొడవ చేస్తున్నాడట.

లక్ష్మమ్మ చివరగా చెప్పిన మాటకు షాక్ అయి ఫోన్ వదిలేసింది కుసుమాంబ. రత్తాలు అనే పేరు వారికి నచ్చలేదట. పెళ్లికి ముందే ఆ పేరు మార్చుకొంటారుట...